ప్రజాశక్తి
శనివారం 17 డిసెంబర్ 2022
5
విజయనగరం



21న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సిఎం జగన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈనెల 21న నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీస్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి కోరారు. శుక్రవారం ఆ పార్టీ యువజన, విద్యార్థి విభాగాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకులు సగంలో ఆపేసిన బాలాజీ జంక్షన్ నుంచి మయూరి జంక్షన్ వరకు , స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ దగ్గర నుంచి కలెక్టరేట్ వరకు రహదారులు పూర్తి చేస్తున్నామని అన్నారు. రైల్వే స్టేషన్ రోడ్డును కూడా ఆధునికరించామని తెలిపారు. నీతిగా, నిజాయితీగా పరిపాలన చేస్తూ కార్యకర్తలు గర్వంగా తలెత్తుకునే విధంగా తన ప్రవర్తన ఉంటుందన్నారు. నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు అల్లు చాణక్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండల డైరెక్టర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు సంఘం రెడ్డి బంగారు నాయుడు, యువజన విద్యార్థి విభాగాల నాయకులు బోడసింగి ఈశ్వరరావు, జివి రంగారావు, జై శంకర్ మాట్లాడారు.

'ఈ ఏడాది ధాన్యం కొనుగోలులో సమూల మార్పులు చేశాం. మిల్లర్ల ఆగడాలను అరికట్టే విధంగా రైతులకు, మిల్లర్ల కు సంబంధం లేకుండా ఈ సారి ధాన్యం కొనుగోలు జరుగుతుంది. ఒక్క ధాన్యపు గింజ కూడా రైతులు మిల్లర్లకు అదనంగా ఇవ్వాల్సిన పని లేదు.' ధాన్యం కొనుగోలు పై ప్రభుత్వ పెద్దలతో పాటు అధికారులు చెప్పిన మాటలివి. కానీ క్షేత్ర స్థాయిలో జరుగుతున్నది అందుకు భిన్నం. ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలు చేసి మిల్లరుకు పంపించినంత వరకు సజావుగా జరుగుతున్నప్పటికీ, మిల్లర్లు ధాన్యం అన్‌లోడు చేసే సమయంలో అసలు పేచీ మొదలవుతోంది. ధాన్యం దించుకోవాలంటే, క్వింటాకు 5 కేజీలు అదనంగా ముట్టజెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ధాన్యాన్ని దించకుండా రోజుల తరబడి ఉంచేస్తున్నారు. దీంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.

ఎప్పటిలాగే మిల్లర్ల దోపిడీ

చోద్యం చూస్తున్న కస్టోడియన్ అధికారులు

హమాలీ ఛార్జీలు రైతుల నుంచే వసూలు

క్వింటాకు 5 కిలోలు అదనం

ప్రజాశక్తి- జామి

ఈ ఏడాదీ ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ అంతా గందరగోళంగా తయారైంది. మిల్లర్లు క్వింటాకు 5 కేజీల ధాన్యాన్ని రైతుల నుంచి అదనంగా డిమాండ్ చేస్తున్నారు. ఎందుకని ప్రశ్నించిన రైతుల ధాన్యాన్ని బస్తాలను దింపకుండా రోజుల తరబడి వాహనాలను నిలిపివేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది 3.37లక్షల ఎకరాల్లో రైతులు వరి పండించారు. సుమారు 4.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లోనూ ఖరీఫ్ వరి కోతలు పూర్తి కావడంతో కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 11,179 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేపట్టగా, కొంత మంది రైతులకు డబ్బులు కూడా ప్రభుత్వం చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇంతవరకు బాగానే కనిపిస్తున్నా, రైతులకు మాత్రం మిల్లర్లు బెడద తప్పడం లేదు. ఆర్‌బికెల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు దించుకోకుండా, కొర్రీ వేస్తున్నారు.

ధాన్యం అన్‌లోడు చేయాలంటే క్వింటాకు 4 నుంచి 5 కేజీలు అదనపు ధాన్యం చెల్లించాల్సిందేని మిల్లర్లు ఒత్తిడి చేస్తున్నారు. అయితే ఆర్‌బికెల్లో ట్రక్కు షీట్ కొట్టడం పూర్తయ్యింది కాబట్టి ఈ సారి ధాన్యానికి బదులు డబ్బులు చెల్లించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. డబ్బులు ఇవ్వకుంటే, ధాన్యం బాగోలేదని నానాయాగి చేస్తూ, లోడును గంటల తరబడి నిలిపేస్తున్న పరిస్థితి. ఈ నేపథ్యంలోనే రైతులకు ఏం చేయాలో పాలుపోవడం లేదని వాపోతున్నారు. జెసికి ఫిర్యాదు చేస్తామంటూ, రాజకీయ పలుకుబడి చూపించి కొందరు పెద్ద రైతులు మాత్రమే మిల్లు వద్ద ధాన్యం దించుకునే పరిస్థితి నెలకొంది. సాధారణ రైతులు మాత్రం మిల్లర్లు చెప్పినట్లు అదనపు ధాన్యానికి డబ్బు చెల్లించి, ధాన్యం దించుకుంటున్న పరిస్థితి నెలకొంది. అలా దించుకున్న ధాన్యానికి కూడా హమాలీ ఛార్జీల కింద క్వింటాకు రూ. 5 చెల్లించాల్సిందే. మిల్లర్లు దౌర్జన్యంగా రైతులు ముక్కుపిండి వసూళ్లకు పాల్పడుతున్నా, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

కస్టోడియన్ అధికారులు ఏమాయ్యారు..?

మిల్లర్లు వద్ద రైతులకు సమస్య తలెత్తితే, వెంటనే ప్రభుత్వం నియమించిన కస్టో డియన్ అధికారులుగా ఉన్న రెవెన్యూ, సివిల్ సప్లయి అధికారులు చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఆర్‌బికెల్లో నాణ్యత ప్రమాణాలు చూసిన తరవాత ఆ ధాన్యం మిల్లర్లు దించుకోవాల్సిందే. కానీ మిల్లర్లు బహిరంగంగానే రైతుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. హమాలీ ఛార్జీలు మిల్లర్లకు చెల్లించనవసరం లేదని జేసీ చెబుతున్నా, మిల్లర్లు అసోసియేషన్ సభ్యులు పాత జీవో కాపీలను చూపించి, రైతుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

అదనంగా డిమాండ్ చేస్తున్నారు

ఆర్‌బికెల్లో ధాన్యం పట్టుకుని మిల్లులకు వెళ్తే అదనపు ధాన్యం కావాలని మిల్లర్లు డిమాండ్ చేస్తున్నారు. గంట్యాడ లోని ఓ మిల్లు యజమాని నానా ఇబ్బందులు పెట్టారు. చివరికి రైతు సంఘం నాయకులతో మాట్లాడి, అదనపు ధాన్యం ఇవ్వడం కుదరదని ఆందోళన చేశాను. కానీ నేను చూస్తుండగానే సాధారణ రైతులు నుంచి అదనపు ధాన్యానికి సరిపడా డబ్బును వసూలు చేసి ధాన్యం దించడం చేస్తున్నారు. పూటంత గొడవ పడితే, హమాలీ ఛార్జీలు తీసుకుని నా ధాన్యం దించారు.

- చలుమూరి మహేష్, జామి

మిల్లర్ల దందా రూపం మారింది

గతంలో రైతుల నుంచి మిల్లర్లు అదనపు ధాన్యాన్ని బాహాటంగానే వసూలు చేస్తే, ఈ సారి ధాన్యాన్ని మిల్లు వద్ద దించే సమయంలో అదనపు ధాన్యానికి బదులు డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇది బాహాటంగానే జరుగుతోంది. క్షేత్ర స్థాయిలో రైతులు ఇబ్బందులు ఉన్నప్పటికీ, అధికారులు ఏమీ లేవని చెప్పడం హాస్యాస్పదం. గ్రామాల్లో సభలు పెట్టి, రైతు సమస్యలు అడిగితే, మిల్లర్ల ఆగడాలపై రైతులు ఏకరువు పెడతారు. జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర చర్యలకు దిగితే తప్పా, అదనపు కేజీల బెడద పోదు.

- బుద్దరాజు రాంబాబు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

అదనంగా తీసుకుంటే చర్యలు

మిల్లర్లు రైతుల నుంచి అదనపు కేజీలు వసూలు చేయడానికి వీల్లేదు. అటువంటి సంఘటనలు మా దృష్టికి రాగా చర్యలు తీసుకున్నాం. ఇంకా జరుగుతున్నట్లు వస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం. హమాలీ ఛార్జీలు వసూలు చేయడానికి వీల్లేదు.

- మీనా కుమారి, సివిల్ సప్లయి డిఎం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

జాతీయ రహదారుల

పనుల్లో వేగం పెంచాలి

అధికారులతో కలెక్టర్ సూర్యకుమారి సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా మీదుగా వివిధ ప్రాంతాలకు అనుసంధానమైన జాతీయ రహదారుల పనుల్లో మరింత వేగం పెంచాలని, త్వరిగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి సూచించారు. రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జాతీయ, ఆర్అండ్‌బి రహదారుల పనుల పురోగతి, భూసేకరణ, చెల్లింపులు తదితర అంశాలపై ఎన్‌హెచ్ ప్రతినిధులు, జిల్లా అధికారులతో కలెక్టర్ శుక్రవారం తన ఛాంబర్లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. చాలా చోట్ల రహదారుల పనులు మందకొడిగా సాగుతుండటంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, త్వరితగతిన చర్యలు చేపట్టి పరిస్థితిని చక్కదిద్దాలని హైవే ప్రతినిధులకు కలెక్టర్ సూచించారు. భూసేకరణ, చెల్లింపులకు సంబంధించిన ప్రక్రియలను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. భూ సేకరణ విషయంలో సమస్యలుంటే సంబంధిత రైతులను ఒప్పించి ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు. విశాఖపట్టణం - రాయ్‌పూర్ 130 సీడీ రహదారి పనులకు సంబంధించి అక్కడక్కడ భూసేకరణ ప్రక్రియలో ఇబ్బందులు ఉన్నాయని హైవే ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సెల్ టవర్లను మార్పు చేయాలని విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయి పర్యటన చేసి సంబంధిత చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూర్యకుమారి విజయనగరం ఆర్డీవోను ఆదేశించారు. 516-ఇ పేరుతో బొడ్డవర నుంచి రాజమహేంద్రవరం వరకు నిర్మిస్తున్న విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఎన్.హెచ్. 26 రహదారిలో అప్రోచ్ రోడ్లకు సంబంధించిన సమస్యలున్నాయని అటు అధికారులు, హైవే ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఉమ్మడి పర్యటన చేసి తదుపరి చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. బై పాస్ రోడ్లకు సంబంధించిన పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో విజయనగరం ఆర్డీవో సూర్యకళ, ఆర్అండ్‌బి ఎస్ఇ విజయ శ్రీ, ఇఇ, ఎన్‌హెచ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అనిల్‌కుమార్‌ను సత్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విద్య, క్రీడలకు ప్రాధాన్యత

కామన్వెల్త్ బంగారు పతక విజేతకు కోలగట్ల అభినందనలు

ప్రజాశక్తి -విజయనగరంటౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యకు, క్రీడలకు ఎంతో ప్రాముఖ్యత ఇస్తున్నారని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఇటీవల కామన్వెల్త్ క్రీడల్లో బంగారు పతకం సాధించిన జిల్లాకు చెందిన భోదంకి అనిల్ కుమార్ శుక్రవారం డిప్యూటీ స్పీకర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోలగట్ల శాలువా కప్పి, పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 24 నుండి డిసెంబర్ 4 వరకు న్యూజిలాండ్ లో జరిగిన 56 దేశాలు పాల్గొన్న అంతర్జాతీయ కామన్వెల్త్ క్రీడా పోటీలలో బొండపల్లి మండలం శామలవలస గ్రామానికి చెందిన బోదంకి అనిల్ కుమార్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని 83 కేజీల కేటగిరీలో బంగారు పతకం సాధించడం దేశానికి, జిల్లాకి గర్వకారణం అని అన్నారు. భవిష్యత్తులో అనిల్ కుమార్ మరిన్ని విజయాలు సాధించాలని అభిలాషించారు. అభినందించిన వారిలో మండల పార్టీ అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు కూడా ఉన్నారు.

సేంద్రీయ ఉత్పత్తులకు మంచి రోజులు

- రైతులు ఆలోచించి సేంద్రీయ సాగు వైపు మళ్లాలి
- కిసాన్ మేళా ప్రారంభోత్సవంలో కలెక్టర్ సూర్యకుమారి
- ఆలోచింపజేసిన వ్యవసాయ ఉత్పత్తులు, పరికరాల ప్రదర్శన

ప్రజాశక్తి-విజయనగరం

సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేసే పంట ఉత్పత్తులకు మంచి మార్కెట్ పరిస్థితులు ఉన్నాయని, వాటి వినియోగం ఈ మధ్యకాలంలో బాగా పెరిగిందని కలెక్టర్ ఎ.సూర్యకుమారి పేర్కొన్నారు. ఆధునిక పద్ధతులను అవలంభించి. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందే విధంగా సేంద్రీయ సాగు వైపు రైతులు మళ్లాలని పిలుపునిచ్చారు. మార్కెట్ బాగున్న పంటలను సాగు చేయాలని ఆర్థిక ప్రయోజనాలను పొందాలని సూచించారు. స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానంలో శుక్రవారం నిర్వహించిన కిసాన్ మేళాను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన పలు వ్యవసాయ ఉత్పత్తుల, పరికరాల స్టాళ్లను ముందుగా సందర్శించారు. నూతన వంగడాల దిగుబడి ఫలాలను, ఎరువుల వినియోగం గురించి అడిగి తెలుసుకున్నారు.

సేంద్రీయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. జిల్లాలో అవలంభించిన ఆధునిక పద్ధతుల ఫలితంగా దిగుబడులు పెరిగాయని, నవధాన్యాలు, చిరుధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల బాగా కనిపించిందని పేర్కొన్నారు. ఇలాంటి కిసాన్ మేళాలలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ కంపెనీలు కూడా సేంద్రీయ పద్ధతులకు ప్రాధాన్యత ఇస్తున్నాయని చెప్పారు. రైతులు ఆరోగ్యకర వ్యవసాయ విధానాలను అనుసరించి లాభాలు పొందాలని ఆకాంక్షించారు. ఖరీఫ్ సాగుకు వెళ్లే రైతులు నూతన పద్ధతుల గురించి ఆలోచించాలని, చిరుధాన్యాల సాగును ఆహ్వానించాలని సూచించారు.

ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు

కిసాన్ మేళాలో పాల్గొనేందుకు వ్యవసాయ పరిశోధనా స్థానానికి విచ్చేసిన కలెక్టర్ అక్కడ నెలకొల్పిన చిరు ధాన్యాల ఉప ఉత్పత్తుల తయారీ విభాగం, చిరుధాన్యాల శుద్ధి కేంద్రం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ విధాన విభాగం, బిస్కెట్ల తయారీ యూనిట్లను సందర్శించారు. వాటి ద్వారా వచ్చే ఆర్థిక ఫలాల గురించి అడిగి తెలుసుకున్నారు. యూనిట్ల పనితీరు, పరికరాల వినియోగం, ఉత్పత్తుల శుద్ధి గురించి అనకాపల్లి పరిధోశన విభాగం సహాయ సంచాలకులు డా. జగన్నాథరావు కలెక్టర్‌కు వివరించారు.

ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలి

అనంతరం జరిగిన సభలో ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ పరిశోధన విభాగం సంచాలకులు పి. రాంబాబు మాట్లాడుతూ పరిశోధన ఫలాలు అందరికీ అందేలా కిసాన్ మేళాలు దోహదం చేస్తాయని అన్నారు. రైతులు వరికి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకులు జగన్నాథరావు మాట్లాడుతూ పరిశోధకుల కృషి ఫలితంగా ఎన్నో విజయాలు సాధించామని తెలిపారు. అందరి కషికి ఫలితంగా 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ఎఫ్ఎఒ గుర్తించిందని వివరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఫలితాలు మరిన్ని సాధించాలంటే పరిశోధనలు మరింత విస్తృతం కావాలని అభిప్రాయపడ్డారు.

కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి.టి. రామారావు, డాట్ కేంద్రం కో-ఆర్డినేటర్ కె. లక్ష్మణ్, సీనియర్ సైంటిస్టు అనురాధ, సోయిల్ సైంటిస్టు సంధ్యారాణి, ఇతర విభాగాలకు చెందిన పలువురు శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

మృతి చెందిన అప్పలనాయుడు

స్లాబ్ కూలి భవన నిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక ఎస్‌విఎన్ నగర్‌లో శుక్రవారం భవనం స్లాబ్ కూలి భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. ఫారెస్ట్ డిపార్టుమెంట్‌కు చెందిన చిరుద్యోగి పి.రామ్మోహనరావు ఇంటి నిర్మాణం చేపట్టారు. స్లాబ్ పనులు పూర్తయి సెంటరింగ్ తొలగిస్తుండగా స్లాబ్ కూలిపోయి నెల్లిమర్ల మండలం గొర్లిపేటకు చెందిన జమ్ము అప్పలనాయుడు అకడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. 2వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జెసి మయూర్ అశోక్, అధికారులు

వినియోగదారుల్లో చైతన్యమే లక్ష్యం

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ప్రజాశక్తి-విజయనగరం

వినియోగదారుల్లో చైతన్యమే లక్ష్యంగా వినియోగదారుల దినోత్సవాన్ని ఈనెల 24న జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ వెల్లడించారు. ప్రస్తుత కాలంలో వినియోగదారులను కలవరపెడుతున్న సైబర్ నేరాలు, జెనెరిక్ ఔషధాల విషయంలో తగిన అవగాహన కలిగించడంపై ఈ ఏడాది ప్రత్యేక దృష్టి పెడుతున్నట్టు చెప్పారు. నగరంలోని రెవిన్యూ భవనంలో 24న జాతీయ వినియోగదారుల దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామన్నారు. వినియోగదారుల కమిషన్‌లలో సమర్థంగా కేసుల పరిష్కారం అనే నినాదంతో ఈ ఏడాది ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వినియోగదారుల దినోత్సవ వేడుకల నిర్వహణపై ప్రభుత్వ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో జె.సి చర్చించారు. వినియోగదారుల హక్కులపై, ఆహార కల్తీ, తూకాల్లో హెచ్చుతగ్గులను గుర్తించడం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆయా ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛందసంస్థలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ వంటి సంస్థల భాగస్వామ్యంతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు. తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో 23న ఇంధన పొదుపు చేసే విద్యుత్ ఉపకరణాల ప్రదర్శనలు, గ్రీన్ ఎనర్జీపై ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు.

సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మధుసూధనరావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మీనా, ఇపిడిసి ఎల్. డిఇ ధర్మరాజు, ప్రాంతీయ ఇంటర్ బోర్డు అధికారి సురేష్ కుమార్, వినియోగదారుల కమిషన్ ప్రతినిధి చదలవాడ ప్రసాద్, ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

టిఎలుగా ఏడుగురు వ్యాయామ ఉపాధ్యాయుల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 17వ తేదీ నుండి 22వరకు గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరుగు మూడవ జాతీయస్థాయి ఏకలవ్య స్కూల్స్ పోటీలకు జిల్లా నుండి ఏడుగురు వ్యాయామ ఉపాధ్యాయులు టెక్నికల్ అఫీషియల్ గా ఎంపికయ్యారు. వీరిలో అనందకుమార్, తవిటినాయుడు, లీలాకృష్ణ, గురునాయు డు, రామకృష్ణ, గణేష్ కుమార్, చంద్ర మోహన్ ఉన్నారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు కృషి

డిప్యూటీ మేయర్ శ్రావణి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్రీడాకారులలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ఈనెల 6,7 వ తేదీలలో విజయనగరంలోని విజ్జి స్టేడియంలో జరిగిన సిఎం క్రికెట్ పోటీలలో విజయనగరం నియోజకవర్గానికి చచెందిన క్రికెట్ జట్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నేపథ్యంలో క్రికెట్ జట్టు శుక్రవారం నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మర్యాదపూర్వకంగా కలిశారు. క్రికెట్ జట్టుకు రవాణా ఖర్చుల కింద రూ.15 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవడం అభినందనీయమన్నారు. ఈనెల 20, 21వ తేదీల్లో మంగళగిరిలో జరిగే సిఎం కప్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలలో వీరు పాల్గొంటున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలలో మొదటి బహుమతిగా రూ.5 లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.3 లక్షలు, తృతీయ బహుమతిగా లక్ష రూపాయలు, పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్క క్రీడాకారుడికి రూ.5వేలు ప్రకటించారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా వాణిని వినిపించాలని , సిఎం కప్ తీసుకురావాలని క్రీడాకారులను ప్రోత్సహించారు.

పిట్టకథలు చెబితే వినాలా..?

ఉపాధిహామీ సిబ్బందిపై పీడీ ఆగ్రహం

ప్రజాశక్తి- మెంటాడ

'మండలంలో 31 పంచాయతీల్లో 26 మంది క్షేత్రసహాయకులున్నారు. రోజుకు 480 మందికి ఉపాధి పనులు కల్పిస్తారా? 15 పంచాయతీల్లో జీరో మస్తరు. ఉన్నచోట రోజుకు 20 నుంచి 30 మందికి పని కల్పిస్తున్నారు. మిగతా వారికి పని కల్పించరా? జీతాలు తీసుకోవడం లేదా? వేతనదారులకు పని కల్పించడంలో శ్రద్ధ కనిపించడం లేద'ంటూ డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి పాధి హామీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో ఆమె సమావేశమయ్యారు. గ్రామాల వారీ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ పనుల వల్ల కూలీలు పనికి రావడం లేదని క్షేత్ర సహాయకులు చెప్పుకొచ్చారు. దీంతో పీడీ ఆగ్రహం చెందారు. 'కోతలు పూర్తయ్యాయి, తుపాను వల్ల వరిచేలు పొలాల్లో నిల్వచేశారు. కూలీలు ఖాళీగా ఉన్నారు. తమాషాగా ఉందా? పిట్ట కథలు చెబితే వినాలా?' అంటూ మండిపడ్డారు. ఒక్కొక్క గ్రామంలో రోజుకు 450 నుంచి 900 మందికి పని కల్పించాలని లక్ష్యం విధిస్తే పూర్తిగా పని కల్పించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. గతేడాది చూపిన ప్రణాళికలో ఎన్ని పనులు చేశారని అడిగారు. చెరువులు నిండితే పనులు కల్పించరా? అని ప్రశ్నించారు. మిగతా పనులు ఎందుకు చేయడం లేదని నిలదీశారు. పనులు కల్పించడంలో ఫీల్డ్‌అసిస్టెంట్లతోపాటు అధికారులు, ప్రజాప్రతినిధుల వరకు సమన్వయ లోపం కనిపిస్తోందన్నారు.

ఫీల్డ్‌అసిస్టెంట్లకు ఒక నెల జీతం నిలుపుదల చేయాలని ఎంపిడిఒ త్రివిక్రమరావుకు ఆదేశించారు. మండలంలో ఉపాధి హామీ అస్తవ్యస్తంగా ఉందని, కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. సమావేశంలో ఎంపిపి రెడ్డి సన్యాసిరావు, వైస్ ఎంపిపి ఈశ్వరరావు, ఎంపిడిఒ త్రివిక్రమరావు, ఎపిఎం చిన్నబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీడీ ఉమా పరమేశ్వరి

ప్రదర్శనను పరిశీలిస్తున్న అధికారులు

ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై ప్రదర్శన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్న పరిస్థితులలో ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ప్రదర్శనశాల ఏర్పాటు చేశారు. ప్రజారోగ్య విభాగం, స్థానిక ప్లాస్టిక్ హోల్‌సేల్ వర్తకులు, మెప్మా సంయుక్త నిర్వహణలో ప్రదర్శనశాల ఏర్పాటైంది. ప్రదర్శన శాలలో ఉంచిన ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువులను కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ, పారిశుధ్య పర్యవేక్షకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీరాములనాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు కొంతమేర ప్లాస్టిక్ నిరోధానికి అవకాశం ఏర్పడిందన్నారు.

ప్రత్యామ్నాయ వస్తువులపై చైతన్యం చేయడం ద్వారా మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగం వల్ల ధరలు కూడా తగ్గే అవకాశం ఉందని అన్నారు. ప్రజలు సహకరించి ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువులను కొనుగోలు చేసి అటు పర్యావరణానికి, ఇటు ప్రజారోగ్యానికి సహకరించాలని కోరారు.

చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-రేగిడి

ఈ నెల 22న రాజాంలో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లూ పూర్తిచేస్తున్నామని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కావలి గ్రీష్మ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం రేగిడి మాజీ ఎంపిపి కిమిడి రామకృష్ణంనాయుడు నివాసంలో చంద్రబాబు పర్యటనపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. సంతకవిటి, వంగర, రాజాం మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఇప్పటికే చర్చించామని ఆమె తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆమె కోరారు. సమావేశంలో నాయకులు పైల వెంకటరమణ, బి.త్రినాథులు, శనపు కేశవనాయుడు, గౌరునాయుడు, బాలాజీ సింహాచలం, కుర్మినాయుడు పాల్గొన్నారు.

నేడు మంత్రి బొత్స రాక

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం జిల్లాకు వస్తున్నారు. ఉదయం 7 గంటలకు నగరంలోని తన నివాసానికి చేరుకుంటారు. ఉదయం 10.30 గంటలకు జె.ఎన్.టి.యు - గురజాడ, విజయనగరంలో ఎగ్జామినేషన్ భవనం, ఎసి ఆడిటోరియం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేస్తారు.

తక్కువ నీటితో ఎక్కువ సాగు

ప్రజాశక్తి-గంట్యాడ

రైతులు తక్కువ నీటితో ఎక్కువ పంటను పండించాలని భూగర్భ జలగనుల శాఖ అధికారి దుర్గాప్రసాద్ అన్నారు. ఎపి ఐఎపిటిసి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక నాయుడు చెరువు ఆయకట్టుదారులకు పంట నీటి ప్రణాళికపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని వృథా చేయకుండా పంటలను పండించి, అధిక దిగుబడి పొందాలన్నారు. ఎపిఐడి మాధవి, ఇరిగేషన్ ఎపిడి రామారావు మాట్లాడుతూ నీటిని సక్రమంగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఆర్‌పిడబ్ల్యు సిబ్బంది, రిసోర్స్ పర్సన్ పట్నాయక్, జియాలజిస్టు త్రివేణి, సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి తెడు, అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రమీల రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -బొబ్బిలిరూరల్

మండలంలో చింతాడ గ్రామంలో రైతుభరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం వైసిపి నాయకులు శంబంగి వేణు గోపాల్ నాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు సంకిలి శాంతకుమారి, సర్పంచ్ బంకురు తిరుపతి రావు, గొంగాడ వలస సర్పంచ్ రామ్మూర్తి, వ్యవసాయశాఖ ఎడి శ్యాంసుందర్రావు, ఎంపిడిఒ అల్లు భాస్కరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చదువు, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-గరివిడి

ప్రతి విద్యార్థి చదువుతోపాటు ఆరోగ్యానికి కూడా అధిక ప్రాధాన్యతనివ్వాలని జిల్లా సామాజిక, పరివర్తన సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ సూచించారు. శుక్రవారం కెజిబివి విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలన, జంక్‌ఫుడ్ వల్ల కలిగే ప్రమాదాలు, రక్తహీనత, పౌష్టికాహారం, మంచి అలవాట్లు, ఉన్నత లక్ష్యాలు, లింగ వివక్ష తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ధనలక్ష్మి, రేవులేఖ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం

ప్రజాశక్తి-గుర్ల

నియామకపత్రాలు అందజేస్తున్న జెడ్‌పిటిసి అప్పలనాయుడు

విధులు సక్రమంగా నిర్వహించి, ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలని జెడ్‌పిటిసి సీర అప్పలనాయుడు, వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు తెలిపారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో కొత్తగా నియమితులైన ఉపాధి హామీ క్షేత్ర సహాయకులకు నియామక పత్రాలను వారు అందజేశారు. కొత్తగా ఏర్పడ్డ ముద్దాడపేట, రౌతుపేట, గొలగాం పంచాయతీల్లో నియామకాలు చేపట్టినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కళ్యాణి, ఎపిఒ కామేశ్వరరావు, ముద్దాడపేట సర్పంచ్ పల్ల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీమా సాయం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

కొండవెలగాడలో ఇటీవల మరణించిన రెడ్డి లక్ష్మణరావు కుటుంబానికి తక్షణ సహాయం కింద వైఎస్ఆర్ బీమా నుంచి రూ.10 వేలను శుక్రవారం జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు అందజేశారు. మిగిలిన సాయం కొద్దిరోజుల్లో బాధిత కుటుంబం ఖాతాల్లో జమవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వై.రమణ, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ కె.గోవిందరావు, నాయకులు మొయిద అక్కోజీ, వల్లూరి రాము, మొయిద పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు శిరీష ఎంపిక

ప్రజాశక్తి-గంట్యాడ

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు గురుకుల పాఠశాల విద్యార్థిని శిరీష ఎంపికైందని వ్యాయామ ఉపాధ్యాయులు ఎ.సంతోష్ తెలిపారు. శిరీషను ప్రధానోపాధ్యాయులు పివి రమణమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

కొలతల ప్రకారం పనిచేస్తే కూలి గిట్టుబాటు

ప్రజాశక్తి-రేగిడి

కొలతల ప్రకారం ఉపాధి హామీ పనులు చేస్తే కూలి గిట్టుబాటు అవుతుందని ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని సరసనాపల్లి పంచాయతీలో నారాయణవారి చెరువు పనులను ఆయన పరిశీలించారు. ముందుగా ఉపాధి వేతన దారులకు కూలి గిట్టుబాటుపై అవగాహన కల్పించారు. పనుల వద్ద మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. కార్యక్రమంలో టిఎ రాంబాబు, ఫీల్డ్అసిస్టెంట్ గణపతి పాల్గొన్నారు.

దొంగతనాల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి-కొత్తవలస

గ్రామాల్లో దొంగలు హల్‌చల్ చేస్తున్నారని, ఇల్లు విడిచి వెళ్లటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సిఐ బాలసూర్యారావు సూచించారు. మండలంలో 202 కాలనీ, కొత్తవలస, నిమ్మలపాలెం, తదితర గ్రామాల్లో శుక్రవారం సిఐ పర్యటించారు. దొంగలున్నారని మైకు ద్వారా ప్రచారం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ దొంగతనం చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో నేరాలకు పాల్పడుతున్నారని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

78 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి-కొత్తవలస

వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలోని దేవాడ వెల్‌నెస్ సెంటర్‌లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైద్యాధికారులు ఇ.గోపాలకృష్ణ, టి.వెంకటరావు 78 మందికి వైద్య సేవలు అందించారు. ఏడుగురు గర్భిణులు, ముగ్గురు బాలింతలకు పరీక్షలు చేశారు. అనంతరం మందులు అందించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఇఒ తిరుపతిరావు, హెచ్ఎస్ రాము, ఎంఎల్‌హెచ్‌పి నాగజ్యోతి, ఎఎన్ఎం విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, హెచ్ఎం వై.పద్మావతి, సత్యనారాయణ, సంతోష్, ఆశా, అంగన్వాడీలు వరలక్ష్మి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

వృద్ధులకు అన్యాయం

బొబ్బిలి : దేశ వ్యాప్తంగా రైళ్లలో ప్రయాణిస్తున్న వయోవృద్ధులకు ఇచ్చే రాయితీలు పునరుద్ధరించే పరిస్థితి లేదని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించడం అన్యాయమని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదరరావు పేర్కొన్నారు.

అనంతబాబు, తోట త్రిమూర్తులు శాసనమండలి సభ్యత్వం రద్దుచేయాలి

ప్రజాశక్తి వేపాడ

దళితుడిని హత్య చేసి, నేరుగా ఇంటికే మృతదేహాన్ని పంపించిన అనంతబాబు, దళితులకు శిరోముండనం చేయించిన తోట త్రిమూర్తులు శాసనమండలి సభ్యత్వం రద్దు చేయాలని దళిత నాయకులు ఉదయ్‌భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఆతవ గ్రామంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ దళితుల మనోభావాలు దెబ్బతీసి ఓట్ల కోసమే దొంగలకు పదవులు ఇవ్వడం అన్యాయమన్నారు. కాపుల ఓట్ల కోసం పదవులు ఇస్తే, దళితుల ఓట్లు సిఎం జగన్‌కు అవసరం లేదా? ప్రశ్నించారు.

తెలియని వ్యక్తులకు పంట అమ్మొద్దు

మొక్కజొన్న లోడుతో పరారైన నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-గరివిడి

చీపురుపల్లి పరిధిలోని మెట్టపల్లికి చెందిన 15 మంది రైతుల నుంచి సేకరించిన 420 బస్తాల మొక్కజొన్న లోడుతో నవంబర్ 24న పరారైన ముగ్గురు నిందితులను చీపురుపల్లి ఎస్ ఐ సన్యాసినాయుడు, సిబ్బంది అరెస్టు చేశారు. వారి నుంచి సరుకు విక్రయించిన రూ.5.58లక్షల నగదును. లారీని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. ఈ కేసులో ఫేక్ నెంబరు ప్లేట్ గల లారీతో రూ.6లక్షల విలువైన మొక్కజొన్న లోడ్ తో పరారైన నిందితులను అరెస్ట్ చేసి నగదు రికవరీ చేసుకోవడంలో క్రియాశీలకంగా పనిచేసిన ఎస్ఐ సన్యాసినాయుడు. కానిస్టేబుళ్లు భానోజీరావు జగదీష్‌లను డిఎస్‌పి బి.మోహన్ రావు అభినందించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

హౌసింగ్ ఇఇ శ్రీనివాసరావు

సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ ఇఇ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కొత్తవలస

జగనన్న ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఇఇ వి.శ్రీనివాసరావు తెలిపారు. కొత్తవలస మేజర్ పంచాయతీ, బలిగొట్టం లేఅవుట్‌లో లబ్ధిదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. ఇప్పటి వరకు మొదలు పెట్టని లబ్ధిదారుల ఇళ్లను ఎందుకు రద్దు చేయకూడదని ప్రశ్నించారు. కార్యక్రమంలో హౌసింగ్ డిఇ డి.శ్రీనివాసన్, ఎఇ కె.రాంప్రసాద్, ఇఒపిఆర్‌డి ధర్మారావు, ఎపిఒ విజయలక్ష్మి, తుమ్మికాపల్లి సర్పంచ్ విరోతి కొండలరావు, ఆదిరెడ్డి నాయుడు, ఎపిఎం శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండగంగుపూడిలో హౌసింగ్ డే

వేపాడ: మండలంలోని కొండగంగుపూడి గ్రామంలో శుక్రవారం హౌసింగ్‌డేను నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గృహనిర్మాణ లక్ష్యాలను చేరుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణ పనులు వేగవంతంగా చేపట్టి, సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి, నిర్మాణ పనులు, బిల్లుల చెల్లింపు, మౌలిక వసతుల కల్పనలో ఉన్న ఇబ్బందులపై తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, హౌసింగ్ ఎఇ అప్పలనాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి, ఎపిఎం శ్రీనివాసరావు, ఎపిఒ సన్యాసిరావు, మండల ఇంజనీరింగ్ అధికారి మహమ్మద్ అలీ, విద్యుత్తు శాఖ ఎఇ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి పద్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం

అవగాహన ర్యాలీలో కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించటం ద్వారా మానవాళిని ముప్పు నుంచి తప్పించవచ్చని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి పేర్కొన్నారు. సాధ్యమైనంత మేర ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, మానవాళిని కాపాడాలని పిలుపునిచ్చారు. నిషేధ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో కలెక్టర్ కూడలి నుంచి చేపట్టిన శుక్రవారం చేపట్టిన బైక్ ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ కంటోన్మెంట్, కన్యకా పరమేశ్వరి ఆలయం, మూడు లాంతర్లు మీదుగా కోట వరకు ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటాయని, ప్రజారోగ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రత్యామ్నాయ వస్తువులను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తగిన చర్యలు కూడా తీసుకోనున్నట్లు ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఇలాంటి అవగాహన ర్యాలీలు ప్రజల్లో విస్తత అవగాహన తీసుకొచ్చేందుకు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ రాములనాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఎసిపి అమ్మాజీరావు, ఇఇ శ్రీనివాసరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ, పారిశుధ్య పర్యవేక్షకులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

లింగ వివక్షకు ముగింపు పలకాలి

ప్రజాశక్తి-వంగర

లింగ వివక్షకు ప్రతిఒక్కరూ ముగింపు పలకాలని ఎంపిపి ఉత్తరవల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక మండల కేంద్రంలో శుక్రవారం ర్యాలీ, మానవహారం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పని ప్రదేశాల్లోనూ స్త్రీ, పురుషులను సమానంగా భావించాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి శేషగిరి, ఎపిఎం చక్రపాణి, వైసిపి నాయకులు బొక్కేల వెంకట అప్పలనాయుడు పాల్గొన్నారు.

డెంకాడ : లింగ వివక్షకు వ్యతిరేకంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ చేపట్టారు. ముందుగా మండల స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, ఎపిఎం గీత, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : బాలికలు, మహిళలపై సమాజంలో జరుగుతున్న దాడులు, సంఘటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ

డెంకాడ.. ర్యాలీ చేపడుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పి.నారాయణరావు సూచించారు. శుక్రవారం నెల్లిమర్లలోని చక్ర కళాశాలలో ర్యాగింగ్, బాలికలు, మహిళలపై దాడుల, రుణ యాప్‌లు, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిస కాకుండా బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తెలిపారు.

తూనిక వేశాకే సరుకులు తీసుకువెళ్లాలి

రేగిడి : డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్‌లో తూనిక వేసి సరుకులు తీసుకువెళ్లాలని డిటి గోవిందరావు, సిఎస్ డిటి గంగభవాని సూచించారు. శుక్రవారం రేగిడి ఎంఎల్ఎస్ పాయింట్ సముదాయంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదాం నుంచి డీలర్లు విధిగా బయోమెట్రిక్ వేసి సరుకులు తీసుకువెళ్లాలని సూచించారు. బయోమెట్రిక్ వేసి సరుకులు తీసుకోని డీలర్లను తొలగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో వైస్ ఎంపిపి జగన్ మోహన్ రావు, డీలర్ల సంఘం మండల అధ్యక్షులు ఎస్.రామ్మూర్తినాయుడు, కార్యదర్శి సత్యం నాయుడు పాల్గొన్నారు.

కరణం శివరామకృష్ణ చర్యలతో పార్టీకి నష్టం

మాజీ ఎమ్మెల్యే కెఎనాయుడు

ప్రజాశక్తి- గజపతినగరం

టిడిపి నియోజకవర్గంలో కరణం శివరామకృష్ణ తన స్వార్థ ప్రయోజనాల కోసం బలహీనపరుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కె.ఎ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పార్టీ కేడర్‌ను నిర్వీర్యం చేసేలా శివరామకృష్ణ వ్యవహరిస్తున్నారని అన్నారు. ఆయన పార్టీ వ్యతిరేక కార్యక్రమాలను చూసి అధిష్టానం హెచ్చరించినప్పటికీ బేఖాతరు చేస్తూ, పట్టీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇలాగే కొనసాగితే పార్టీ కార్యక్రమాలకు తాము దూరం అవ్వాల్సి వస్తుందని అధిష్టానానికి సూచించారు. కార్యక్రమంలో బొండపల్లి జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బండారు బాలాజీ, కోరాడ కృష్ణ, అట్టాడ లక్ష్మునాయుడు, పివివి గోపాలరాజు, గంట్యాడ శ్రీదేవి, వివి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గాయత్రి ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరంరూరల్

గాయత్రి

విజయనగరం రూరల్ మండలంలోని సుంకరపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి బోగి గాయత్రి అండర్-17 టెన్నికాయిట్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. గురువారం చీపురుపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.చంటి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు త్రినాథరావు, రాజ్యలక్ష్మి.. గాయత్రిని అభినందించారు.

వైసిపిని నమ్మి మోసపోవద్దు

టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగార్రాజు

ప్రజాశక్తి -భోగాపురం

వైసిపి ప్రభుత్వాన్ని నమ్మి మళ్లీ మోసపోవద్దని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగారురాజు, మండల పార్టీ అధ్యక్షులు కుర్రోతు సత్యనారాయణ అన్నారు. గూడెపువలసలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోరాడ తాతారావు , భోగాపురం క్లస్టర్ ఇంఛార్జి దాసరి అప్పలస్వామి , పిడుగు తోటారావు ,పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కర్రోతు రాజు , భోగాపురం మండల ప్రధాన కార్యదర్శి సీరపు శ్రీను, ఉపాధ్యక్షులు కోల రామసూరి, ముంజేరు టిడిపి యువ నాయకులు పిడుగు చందు , దారపురెడ్డి మధు దల్లి పేట టిడిపి యువ నాయకులు కిలుము రామారావు , గుడెపువలస గ్రామ టిడిపి అధ్యక్షులు కొండాపు రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని టిడిపి మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కరనాయుడు తెలిపారు. మండలంలోని బురదపాడు గ్రామంలో ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. రానున్న ఎన్నికలలో అరాచక పాలన సాగిస్తున్న ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి రంది రామునాయుడు పాల్గొన్నారు.

గంట్యాడ.. మాట్లాడుతున్న కొండపల్లి భాస్కరనాయుడు

రోడ్డుపైకి మురుగునీరు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కరకవలస గ్రామంలో ప్రధాన రహదారిపై మురుగునీరు చేరుతోంది. రోడ్డుపై అడుగుకో గొయ్యి ఏర్పడటంతో అందులో మురుగునీరు నిల్వ ఉంటోంది. దీంతో స్థానికులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి మురుగునీరు రోడ్డుపైకి చేరకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపైకి చేరిన మురుగునీరు

మొయిదలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని మొయిద విజయరామపురం చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు పేదలకు నూతన దుస్తులు పంపిణీ చేశారు.

బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వ్యాయామ ఉపాధ్యాయులు జి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో శుక్రవారం బాల్ బ్యాడ్మింటన్ అండర్ -14 ,17, 19 జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పీడీ పొట్నూరు శ్రీరాములు వ్యవహరించారు. క్రీడాకారులకు ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్.వి.సత్యశేఖర్, ప్రభుత్వ పాఠశాల యాజమాన్యం సహకారంతో సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎం.వెంకటలక్ష్మి , వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, ఎంపిటిసి మజ్జి దేవి, ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్.వి.సత్యశేఖర్, ప్రధానోపాధ్యాయులు ఎన్ను అప్పారావు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని అలుగోలు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అండర్ -17, 19 బాలుర, బాలికల విభాగాల్లో పోటీలను వైస్ ఎంపిపి సారికి వైకుంఠం నాయుడు, సర్పంచ్ అలుగోలు బంగారమ్మ ప్రారంభించారు. హెచ్ఎం నల్లా జగదీశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎల్.వి.రమణ, బొమ్మన రామారావు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎస్.వెంకు నాయుడు, పీడీలు సూర్యారావు, తౌడుబాబు, కమలనాథరావు, తదితరులు పాల్గొన్నారు.



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న గిరిబాబు కుటుంబ సభ్యులు

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురానికి చెందిన వరుపుల గిరి కుటుంబ సభ్యులు శుక్రవారం పేదలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. గిరి అన్నయ్య వరుపుల శ్రీనివాసరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా అన్నదానం ఏర్పాటుచేశారు. అనంతరం సేవా కార్యక్రమాలు చేపట్టారు.

పేదలకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

పండ్లు పంపిణీ చేస్తున్న రియాజ్‌ఖాన్, తదితరులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వారోత్సవాలలో భాగంగా శుక్రవారం ఇందిరమ్మ కాలనీలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రియాజ్ ఖాన్ పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానికులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

నెల్లిమర్ల : జరజాపుపేటలో అక్రమంగా విక్రయిస్తున్న 7 మద్యం సీసాలను పట్టుకున్నట్లు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. ముందస్తు సమాచారం రావడంతో దాడి చేసి మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేసినట్లు చెప్పారు.

డిపో వద్ద ధర్నా చేస్తున్న బేవరేజెస్ కళాసీలు

బేవరేజెస్ కళాసీల ధర్నా

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నూతన కూలీ రేట్ల ఒప్పందం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన స్థానిక బేవరేజెస్ డిపో వద్ద కళాసీలు ధర్నా చేపట్టారు. శుక్రవారం లోడింగ్, అన్‌లోడింగ్ నిలిపేసి, ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రమణ మాట్లాడుతూ సిగ్మా కంపెనీతో గతేడాది అక్టోబర్‌తో ఒప్పందం ముగిసిందని, నేటికీ కొత్త ఒప్పందం చేయలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు అధికారులతో జరిపిన చర్చలు విఫలం కావడంతో పనులు నిలిపేసినట్లు తెలిపారు. కూలి రూ.7 నుండి 10 రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి బేవరేజెస్ జిల్లా నాయకులు శ్రీను, మేస్త్రి రామకృష్ణ, కళాసీలు, తదితరులు పాల్గొన్నారు.

పిఎంజెఎవై నమోదు వేగవంతం

ప్రజాశక్తి-బొబ్బిలి

పిఎంజెఎవై నమోదు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం పిఎంజెఎవై నమోదుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయంలో పిఎంజెఎవై నమోదు వేగవంతం చేయాలని కోరారు. యాప్‌లో పెండింగులో ఉన్న ఇకెవైసి పూర్తి చేయాలని కోరారు. అప్రూవ్ అయిన వారికి కార్డులు అందజేయాలని కోరారు. పనిలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రుణాలు మంజూరు చేయాలి

డ్వాక్రా మహిళలకు రుణాలు మంజూరయ్యేలా మెప్మా సిబ్బంది, ఆర్‌పిలు పని చేయాలని కమిషనర్ శ్రీనివాసరావు కోరారు. రుణాలపై మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మెప్మా, రిసోర్స్ పర్సన్లతో సమావేశం నిర్వహించారు. డ్వాక్రా మహిళలకు రుణాలు మంజూరయ్యేలా చూడాలని, రుణాలు రికవరీ చేసేందుకు కృషి చేయాలని సూచించారు.

పింఛను దరఖాస్తుల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో కొత్తగా సామాజిక పింఛన్ల మంజూరు కోసం ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను అధికారులు రెండు రోజులుగా పరిశీలన చేపడుతున్నారు. శుక్రవారం బానాది, నల్లబెల్లి , ఎన్‌కెఆర్ పురం గ్రామ సచివాలయాల్లో దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. ఈ పరిశీలనలో ఎంపిపి డి.సత్యవంతుడు , ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, ఎంపిటిసి జి.తులసి, సర్పంచులు జి.దేవి, కర్రి యశోద, తదితరులు పాల్గొన్నారు

రేగిడి : మండలంలోని లింగాలవలస, తోకలవలస, వన్నలి, చాటాయివలస, కొమిరి తదితర గ్రామాల్లో పింఛన్లను ఎంపిడిఒ జి.కాశీవిశ్వనాథరావు శుక్రవారం తనిఖీ చేశారు. పింఛన్ల అర్హతపై విచారణ చేపడుతున్నారు. అర్హత లేని పింఛన్లను తొలగిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కొమిరి కార్యదర్శి కేశవరావు పాల్గొన్నారు.



వేపాడ.. దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపిపి, ఎంపిడిఒ

స్త్రీనిధి లక్ష్యాలను పూర్తిచేయాలి

ప్రజాశక్తి-గుర్ల

స్త్రీనిధి లక్ష్యాలను నూరుశాతం పూర్తిచేయాలని ఎజిఎం ఉమామహేశ్వరరావు తెలిపారు. మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం గ్రామ సంఘ సహాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆదనపు ఆదాయం పెంచుకొనే నిమిత్తం మహిళా సంఘ సభ్యులను గుర్తిస్తూ స్త్రీనిధి రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. వాటిని సకాలంలో తిరిగి వసూలు చేయాలని చెప్పారు. ఎపిఎం నారాయణరావు మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆసరా ద్వారా ప్రతి సభ్యురాలికి జీవనోపాధి కార్యక్రమాలవైపు అవగాహన కల్పించి, ప్రోత్సహించాలని చెప్పారు. సమావేశంలో ఎఎంఎస్ అధ్యక్షులు బి.సన్యాసమ్మ, ఎఫ్‌పిఒ భారతి, తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT BOBBILI
F.D.I.A. 05/2020 :: O.S. 220/2012

Between
Kota Nageswara Rao....Petitioner/Plaintiff
AND:
Kota Murali Krishna and 3 others
.....Respondents/Defendants

NOTICE

To,
R-1) Kota Murali Krishna S/o late Sankara Rao, House No. 72, Near Double Road, Babametta, VIZIANAGARAM
R-4) Arisety Geet S/o Eswara Rao, Door No. 17-541/3, Ralla Veedhi, BOBBILI, District: Vizianagaram

Where as on the above named Petitioner/Plaintiff has instituted the above petition suit against you for passing Final Decree in terms of the Preliminary Decree. You are hereby summoned to appear in this Court in person or by a pleader, duly instructed and able to answer all material questions relating to the petition who shall be accompanied by some person able to answer all such questions on the **21ST Day of DECEMBER, 2022, at 10-30 A.M.** to answer the claim and further you are hereby directed to file within 30 days of service of summons a written statement of your defence and to produce on the said day all documents in your possession or power upon which you base your defence.

Take Notice that in default of your appearance and to file your counter within thirty days the suit will be heard and determined in your absence.

By Order of the Honourable Court
I. RAMESH
Y.MADHUSUDANA RAO
ADVOCATES,
V izianagaram,
Cell: 9440738240

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
I.P. 19/2022

Between:
Smt.Balla Sarada .....Petitioner
And:
Korupolu Varalakshmi and 10 others
.....Respondents

NOTICE

Respondents

1. Korupolu Varalakshmi, wife of Tatam Naidu, Hindu, aged about 38 years, residing at Lankavanipalem village, K.Kotapadu Mandal, Anakapalle, District, Aadhar and Cell numbers are not known to the petitioner
2. Vinnakota Rajesh, sonof late Venkata Raju, Hindu, aged about 55 years, Business Rajesh Medicals Opposite Primary Health Center, Railway Gate, Kothavalasa, Vizianagaram District, Aadhar and Cell numbers are not known to the petitioner
3. Urukuti Pydi Raju @ Disco Master, son of late Simhachalam, Hindu, aged about 60 years, residing at Back Side of L.G Polymers, Near Krishna Temple, Old Venkatapuram, Gopalapatnam, Visakhapantam, Aadhar and Cell numbers are not known to the petitioner
4. Kapuganti Sadhu Babu, son of late Pydi Raju, Hindu, aged about 65 years, residing at Pathavalasa Village, K.Kotapadu Mandal, Anakapalle District, Aadhar and Cell numbers are not known to the petitioner
5. Kotha Varahala Setti, son of late Gopala Krishna, Hindu, aged about 60 years, residing at Marrivalasa Village, K.Kotapadu Mandal, Anakapalle District, Aadhar and Cell numbers are not known to the petitioner
6. Seemusuru Lingalu, son of late Sannibabu, Hindu, aged about 60 years, residing at Marrivalasa Village, K.Kotapadu Mandal, Anakapalle District, Aadhar and Cell numbers are not known to the petitioner
7. Nadipena Ramu, son of Appa Rao, Hindu, aged about 48 years, Chicken Shop, Near Santha Market, Opposite Old MDO Office, Kothavalasa, Vizianagaram District, Aadhar and Cell numbers are not known to the petitioner
8. Gandepalli Srinivasu, son of Paradesi, Hindu, aged about 40 years, residing at Opposite Penthukost Church, Near SC Girls Hostel, Kothavalasa, Vizianagaram District, Aadhar and Cell numbers are not known to the petitioner
9. Kesa Satyanarayana @ Allamsetti, son of late Appala Raju, Hindu, aged about 48 years, Kiran Business, Main Road, Near Durga Devi Temple, Kothavalasa, Vizianagaram District, Aadhar and Cell numbers are not known to the petitioner
10. Dogga Srinu, son of late Sriramulu Naidu, Hindu, aged about 58 years, residing at Kommipilli Village, Vepada Mandal, Vizianagaram District, Aadhar and Cell numbers are not known to the petitioner
11. Karri Venkatilaxmi, wife of Eswawra Rao, Hindu, aged about 40 years, residing at Mangala Veedhi, Kothavalasas, Kothavalasa Mandal, Vizianagaram District, Aadhar and Cell numbers are not known to the petitioner

పై నెంబర్ ఇ.పి. 19/2022 లో పిటిషనర్ ఇందలి రెస్పాడెంటాల వద్ద నుండి ఋణములు తీసుకోని ఉరిమిల దివాలా తీసి నందున అందుకు పిటిషనరు ఇన్ సాల్వెంట్ పర్సనగా డిక్లేర్ చేయమని కోరుచూ పై వ్యాద్యము దాఖలు చేయగా, సదరు వ్యాద్యము 30-12-2022దిన వాయిదా వేసినారు. కావు న అందుకు ఎవరికైన ఎటువంటి ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టులో **తే॥ 30-12-2022 దిన ఉదయం గం॥ 10-30 ని॥** లకు హాజరు అయి వారి అక్షేపణలు ఇందుమూలంగా తెలియపరచుకోనవలనదిగా చేయడమైనది.

By Order of the Honourable Court
గరవ కృష్ణ
అడ్వకేట్, కొత్తవలస,
సెల్ : 8341291598